క్లుప్తంగా

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న విద్యుత్ ఉన్నతాధికారులు

ధర్మవరం: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో పరిష్కరించామని పుట్టపర్తి ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివరాములు తెలిపారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు సబ్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన వచ్చింది. ఈ విద్యుత్ అదాలత్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివరాములు, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనికుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరై వినియోగదారుల నుంచి సమస్యలు స్వీకరించారు. మొత్తం 28 ఫిర్యాదులు రాగా వాటిలో ఐదు ఫిర్యాదులను అక్కడే పరిష్కరించారు. మిగిలిన 23 ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేశారు. సంబంధిత అధికారుల ద్వారా విచారణ చేయించి పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మినరసింహారెడ్డి, ఏఈ రామస్వామి, ఏఏఈ రామకృష్ణ, ఏఈలు నాగభూషణం, కొండారెడ్డి, జానకిరామయ్య, శివయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

సోమిశెట్టి సరళకు ఉగాది పురస్కారం



ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణానికి చెందిన జానపద గాయకురాలు సోమిశెట్టి సరళకు 2025 సంవత్సరానికి జాతీయస్థాయిలో ఉగాది పురస్కారం దక్కింది. తిరుపతి సిటీ చాంబర్‌లో 28వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి 2025 సంవత్సరానికి ఉగాది పురస్కారాలు ప్రకటించారు. కళారంగానికి సంబంధించి సోమిశెట్టి సరళను ఎంపిక చేశారు. ఈనెల 27వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం వారి సౌజన్యంతో తిరుపతి పట్టణంలోని మహతి ఆడిటోరియంలో జరగబోవు వేడుకల్లో ఉగాది పురస్కారం అందిస్తారని జానపద గాయకురాలు సరళ తెలిపారు.

ఒకేషనల్ విద్యతో ఉపాధి అవకాశాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఒకేషనల్ విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమన మాట్లాడుతూ.. పదో తరగతి అనంతరం విద్యార్థులు ఒకేషనల్ విద్యపై ఆసక్తి చూపితే ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు నేర్చుకున్న విద్యార్థులకు వృత్తివిద్యా అధ్యాపకురాలు కళ్యాణి, అనూష సర్టిఫికెట్లు అందజేశారు.

ఉపకరణాల పంపిణీ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఆరు రొలేటర్లు, మూడు వీల్ ఛైర్లు, మూడు సీపీ స్పెషల్ వీల్ ఛైర్లు, మూడు ఎంఆర్ కిట్లు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బత్తలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఐఈఆర్పీలు ఖాదిరెడ్డి, ప్రసాద్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇల్లు

తనకల్లు: మండలంలోని పూలకుంటపల్లికి చెందిన నరేంద్ర ఇల్లు పిడుగుపాటుకు దెబ్బతింది. సోమవారం ఈదురు గాలులకు ఇంటిపై పిడుగు పడటంతో పైకప్పు కూలిపోయింది. దీంతో ఇంట్లోని ఇతర వస్తువులు పాడైపోయాయి. దాదాపు రూ.లక్ష వరకూ నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లిలో సోమవారం ఆంజనేయస్వామి జ్యోతుల ఉత్సవం వైభవంగా జరిగింది. ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు జ్యోతులు ఎత్తుకొని గ్రామ పురవీధుల గుండా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి సమర్పించారు. మంగళవారం గ్రామ దేవతలైన సల్లాపురమ్మ, పోతలయ్యస్వాములకు బోనాలు ఉత్సవాన్ని నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

పట్టుకోండి చూద్దాం..



- ధర్మవరంలో దొంగల హల్‌చల్
- ద్విచక్ర వాహనాలు, తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- కేసుల ఛేదింపులో పోలీసుల విఫలం

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పట్టుకోండి చూద్దామంటూ పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. కొన్ని నెలలుగా తాళం వేసిన ఇళ్లు, ద్విచక్ర వాహనాలు టార్గెట్ చేసుకుంటున్న దొంగలు రెచ్చిపోతున్నారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకూ 8 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. ఇంక సెల్‌ఫోన్ల చోరీలు చెప్పనక్కర్లేదు. ప్రతి వారపు సంతలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పదుల సంఖ్యలో ఉంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సైతం సెల్‌ఫోన్ల దొంగలు ప్రయాణికుల జేబులు కొడుతున్నారు. మరోసారి పట్టణంలో దొంగతనాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కేసులు నమోదు చేసిన ద్విచక్ర వాహనాలు కొన్ని అయితే.. కేసులు కట్టకుండా ఫిర్యాదులు మాత్రమే స్వీకరించిన ద్విచక్ర వాహనాల దొంగతనాల ఫిర్యాదులు చాలా ఉన్నాయి. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దొంగలను పట్టుకోవాల్సిన అవసరం ఉంది.

ఇటీవల జరిగిన దొంగతనాలు ఇలా..

గత ఏడాది డిసెంబర్ 9వ తేదీన గాంధీ నగర్‌లో వైఎస్సార్‌సీపీ చేనేత నాయకుడు గుండా ఈశ్వరయ్య తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి ముఖానికి గుడ్డ కట్టుకున్న ఓ దొంగ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడు. ద్విచక్ర వాహనం దొంగతనం చేస్తున్న దృశ్యాలు అక్కడున్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.



గాంధీ నగర్‌లో ద్విచక్ర వాహనాన్ని అపహరిస్తున్న దృశ్యం (సీసీ ఫుటేజీ)

- ఈ ఏడాది మార్చి 7వ తేదీన పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురంలో నివసిస్తున్న ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు గంగాద్రి ఊరికి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు రెచ్చిపోయారు. ఇంట్లోకి ప్రవేశించి 5.2 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.
- మార్చి 9వ తేదీన వైఎస్సార్ కాలనీలో మున్సిపల్ ఉద్యోగి బోయ వీరన్న బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండటంతో కుటుంబ సభ్యులతో కలిసి రామగిరి మండలానికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగలకొట్టి బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలో ఉన్న ఒక జత బంగారు కమ్మలు, రూ.40 వేలు నగదు దొంగిలించారు.



వైఎస్సార్‌కాలనీలో దొంగలు ధ్వంసం చేసిన బీరువా (ఫైల్)

- మార్చి 20వ తేదీన పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో సాకే బాబు అనే వ్యక్తి తన హోండా డియో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి వెళ్లాడు. అరగంట లోపే దొంగలు ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడం విశేషం.
- మార్చి 23వ తేదీన అర్ధరాత్రి రెండు ద్విచక్ర వాహనాలకు చోరీకి గురయ్యాయి. పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన సునిత తన స్కూటీని ఇంటి ముందు పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రపోయింది. దొంగలు స్కూటీని దొంగతనం చేశారు. అదే రోజు రామ్‌నగర్‌కు చెందిన వేణుగోపాల్ తన స్కూటీని ఇంటి ముందు పార్కింగ్ చేయగా దొంగలు ఎత్తుకెళ్లారు.
- మార్చి 24వ తేదీన పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో పాత్రికేయుడు డేగల రవికుమార్ తన హోండా నియో ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి దొంగలు ద్విచక్ర వాహనాన్ని దొంగతనం చేశారు.
- మార్చి 28వ తేదీన కేతిరెడ్డి కాలనీలో చేనేత కార్మికుడు ప్రకాష్ తన కుటుంబ సభ్యులతో వేరే గ్రామానికి వెళ్లాడు. దొంగలు ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టారు. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి, అరతులం బంగారు కమ్మలు, వెండి ఆభరణాలను చోరీ చేశారు.
- ఏప్రిల్ 9వ తేదీన కొత్తపేటలో నూతన ఇంటి నిర్మాణం చేపట్టిన బొమ్మన వెంకటరమణ ఎలక్ట్రికల్ మోటర్‌ను నూతన ఇంటిలో పెట్టాడు. గుర్తు తెలియని దొంగలు మోటర్‌ను దొంగతనం చేశారు.
- ఏప్రిల్ 14వ తేదీన కొత్తపేటకు చెందిన కిరణ్ కుమార్ తన ఇంటిముందు పార్కింగ్ చేసిన ఏపీ02 బిక్యూ 4075 నంబర్ గల డియో స్కూటీని దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీసీ కెమెరాల పనితీరు అంతంత మాత్రమే..

ధర్మవరం పట్టణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి పనితీరు అంతంత మాత్రంగానే ఉంది. వార్డుల్లోని వీధుల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. కొన్ని వార్డుల్లో ఇళ్లకు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల్లో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. వీడియోల ఆధారంగా దొంగలను పట్టుకోవడంతో పోలీసులు విఫలమవుతున్నారు.

వాహనం రికవరీ కాలేదు..



నా ద్విచక్ర వాహనం పోయి ఐదు నెలలైంది. ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని దొంగ అర్ధరాత్రి సమయంలో దొంగతనం చేశాడు. దొంగతనం చేసే దృశ్యాలున్న సీసీ ఫుటేజీని వన్‌టౌన్ పోలీసులకు అందించాను. డిసెంబర్ 9వ తేదీన నా ద్విచక్ర వాహనం దొంగతనానికి గురికాగా ఇంత వరకు రికవరీ కాలేదు. పోలీసులు చొరవ చూపి త్వరితగతిన ద్విచక్ర వాహనాన్ని రికవరీ చేసి అందించాలి.

– గుండా ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు, ధర్మవరం

దొంగలను పట్టుకుంటాం



ద్విచక్ర వాహనాల దొంగతనాలు తరచూ జరుగుతున్నాయి. ముఖ్యంగా యువకులు జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్నారు. దొంగతనం చేసిన వారు ఎప్పటికైనా దొరుకుతారు. ఇప్పటికే బత్తలపల్లి పోలీసులు ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసే యువకులను అరెస్టు చేసి ద్విచక్ర వాహనాలను రికవరీ చేయగా టూ టౌన్ పరిధిలో మూడు ద్విచక్ర వాహనాలు దొరికాయి. మిగిలిన ద్విచక్ర వాహనాలను రికవరీ చేస్తాం. దొంగలను త్వరితగతిన పట్టుకుంటాం.

– రెడ్డప్ప, సీఐ, టూటౌన్ పోలీస్‌స్టేషన్, ధర్మవరం

తెలుగు తమ్ముళ్ల బరి తెగింపు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం పోతులకంట గ్రామంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులకు చెందిన 12 ట్రాక్టర్ల ఎరువును డంపింగ్ యార్డుకు తరలించారు. వివరాలు.. కొత్తచెరువు మండలం పోతులకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిదంబరరెడ్డి, రామిరెడ్డి 50 సంవత్సరాల నుంచి 2 సెంట్ల పోరంబోకు స్థలంలో ఎరువు దిబ్బలు వేసుకున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చారన్న అక్కసుతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శంకర నారాయణ, విష్ణువర్ధన్, మల్లికార్జున, కేశవ, లింగప్ప, వెంకట నారాయణ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు ఇప్పించారు. రస్తా పేరుతో టీడీపీ నాయకులు స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్థలంలో ఉన్న 12 ట్రాక్టర్ల ఎరువును డంపింగ్ యార్డుకు తరలించారు. స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేసినట్లు బాధితులు చిదంబర్ రెడ్డి, రామిరెడ్డి తెలిపారు. అధికార పార్టీ నాయకుల ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు



జేసీబీతో ఎరువును ట్రాక్టర్‌లోకి వేస్తున్న దృశ్యం

మద్యం దుకాణం తొలగించాలి

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి (ప్రశాంతి గ్రామ్) వద్ద ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని దండోరా, ఎమ్మార్పీఎస్ అనంత, సత్యసాయి జిల్లా అధ్యక్షులు హెచ్.అక్కులప్ప, గంగాద్రి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిప్రతం అందజేశారు. గతంలో పుట్టపర్తికి 10 కిలోమీటర్ల దూరంలో మద్యం, మాంసం దుకాణాలు, థియేటర్లు ఉండకూడదని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రభుత్వానికి విన్నవించిందని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన ప్రభుత్వమే నిబంధనలను ఉల్లంఘించి మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడం చాలా బాధాకరమన్నారు. అధికారులు స్పందించి అక్కడ ఉన్న మద్యం దుకాణాన్ని వేరే చోటుకు మార్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యం షాపు ఉండటంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని గుర్తు చేశారు. లేని పక్షంలో స్థానికులు, సత్యసాయి భక్తులతో కలసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోళాపురం గంగాధరప్ప, నరసింహులు, రెడ్డప్ప, రామచంద్ర, సాయినగర్ నాగన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతి గ్రాం వద్ద ఉన్న మద్యం దుకాణం తొలగించాలని ఫిర్యాదు చేస్తున్న నాయకులు

శ్మశాన వాటికను కాపాడాలి

ధర్మవరం పట్టణంలోని 19వ వార్డులో గతంలో ముస్లింల శ్మశాన వాటికకు ప్రభుత్వం కొంత స్థలాన్ని మంజూరు చేసింది. ఆ స్థలంలో ఒక వైపున ఉన్న కాంపౌండ్ వాల్‌ను తొలగించి వ్యక్తిగత నివాసాలు, వాణిజ్య భవనాలను నిర్మిస్తున్నారని 19వ వార్డు ప్రజలు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సదరు నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు.

పీడీ పోస్టులను కన్వర్షన్ చేయొద్దు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీలుగా పని చేస్తున్న వారిని లెక్చరర్లుగా కన్వర్షన్ చేయడం తగదని వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, కల్పన, పద్మావతి, సరళ వాపోయారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలల్లో వ్యాయామ విద్య లేకుండా చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం తగదన్నారు. ఇంటర్మీడియట్‌లో వ్యాయామ విద్యకు తీరని విఘాతం కలుగుతుందన్నారు. గతంలో కొన్ని కళాశాలలకు పోస్టులు మంజూరు కాకపోవడాన్ని సాకు చూపిస్తూ పీడీలను షిఫ్ట్, కన్వర్షన్ పేరుతో లెక్చరర్లుగా మారుస్తున్నారని వాపోయారు. జోన్-4 రాయలసీమ జిల్లాల్లో జూనియర్ కళాశాలల్లో షిఫ్ట్, కన్వర్షన్ మొత్తంగా 83 ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్ లెక్చరర్స్ పోస్టులను ఇతర సబ్జెక్టులకు కన్వర్షన్ చేయడానికి డైరెక్టర్ ఆదేశాలతో విద్యార్థులకు వ్యాయామ విద్య కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేసేందుకు ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ పోస్టులను కొనసాగించి న్యాయం చేయాలని కోరారు.



ప్రిన్సిపాల్ ప్రశాంతికి వినతిపత్రం అందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

సంక్షిప్త సమాచారం

వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలి

తనకల్లు: బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతుల నుంచి వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్టేట్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేశారు. శివన్న, రెడ్డెప్ప, రమణ, రమణ, చలపతి, శ్రీనివాసులు, వేమన్న, పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో రేకుల షెడ్డు నిర్మాణం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని హరిహర గణపతి దేవాలయం ఆవరణలో రూ.5 లక్షల వ్యయంతో రేకుల షెడ్డు నిర్మించారు. బెంగళూరుకు చెందిన నామా పద్మనాభయ్య శెట్టి 1984–85లో ముదిగుబ్బ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాడు. సొంత గ్రామానికి మేలు చేయాలనే ఉద్దేశంతో ఇటీవల ముదిగుబ్బకు వచ్చినప్పుడు పూజారి రఘునాథశాస్త్రి కోరిక మేరకు రేకుల షెడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేశారు. ఆ నిధులతో ఆలయ ఆవరణలో షెడ్డు నిర్మించారు. ఈనెల 30వ తేదీన పద్మనాభయ్య శెట్టి సొంత ఖర్చులతో ఆలయం వద్ద వారాహి, మృత్యుంజయ హోమం చేస్తున్నట్లు పూజారి రఘునాథశాస్త్రి తెలిపారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

అమడగూరు: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందజేసే సబ్సిడీ రుణాలకులో ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మునెప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

హామీలు నెరవేర్చాలి

కదిరి టౌన్: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం నాయకులు కోరారు. కదిరి రూరల్ కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సోమవారం డిప్యూటి తహసీల్దార్ ఈశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జీఎల్ నరసింహులు, సాంబశివ, రాంమోహన్, ముస్తాక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ధర్మవరం: పట్టణంలోని కదిరిగేటు సమీపంలో మున్సిపల్ పైపులైను మరమ్మతు కారణంగా మంగళవారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. సోమవారం కదిరిగేటు సమీపంలో మరమ్మతుకు గురైన నీటి సరఫరాకు సంబంధించిన జోన్-1 పంపింగ్ లైన్‌ను కమిషనర్ పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

తోపుడు బండి వితరణ

పుట్టపర్తి టౌన్: కర్ణాటక నాగేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ వారు సమకూర్చిన తోపుడు బండిని అర్బన్ సీఐ సునీత సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సాయిశ్రీకాంత్, షాకీర్ అలీ, కుంటమద్ది రామాంజి, హన్ను, ఇర్ఫాన్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఏఎస్ఐ మధు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

ఓడీచెరువు: ఉపాధి పనులు కల్పించాలని మండలంలోని మల్లెవాండ్లపల్లె గ్రామస్తులు సోమవారం సీపీఐ నాయకులతో కలసి ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. ఇప్పటికీ చాలా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించలేదన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని పేర్కొన్నారు. సీపీఐ ప్రజా సంఘాల నాయకులు శ్రీరాములు, రామిరెడ్డి, రమణ, శివయ్య, వెంకటలక్ష్మి, నరసమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

'పీపీఎస్'లో గ్రాడ్యుయేషన్ డే

ముదిగుబ్బ: స్థానిక పీపీఎస్ పాఠశాలలో సోమవారం యూకేజీ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరుపుకున్నారు. యువ సాధకులు టోపీలు, గౌనులు ధరించి ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ డే పిల్లల విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని పాఠశాల చైర్మన్ పీపీఎస్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ మనీషా, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మూల విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం మూల విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం వేదపండితుడు చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ, హనుమ, వినాయక, గరుడ సమేత విగ్రహాలకు పూజలు చేపట్టారు.

ఉపాధ్యాయురాలి మృతి

రొద్దం: స్థానిక ఎంజేపీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు కావ్యదీప (24) జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈమె పెనుకొండలోని వజ్రాలపేటలో నివాసం ఉంటున్నారు. భార్య మృతి చెందడంతో భర్త జగదీష్ బోరున విలపించాడు. తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు.

ఇంటి రస్తా మూసివేశారని ఫిర్యాదు

తనకల్లు: తన ఇంటి ముందు అక్రమంగా జేసీబీలతో పెద్ద పెద్ద బండలు, రాళ్లను వేసి రస్తాను మూసివేశారని ఉప్పువాండ్లపల్లికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దారిని మూసివేయడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

నలుగురిపై కేసు నమోదు

ముదిగుబ్బ: సిరిగారపల్లి గ్రామంలో సోమవారం నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ లిపారు. పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిగారపల్లిలో సోమవారం రాత్రి తమ ఇంటి ముందు వేణు, రాజు అనే వ్యక్తులు మంచం వేసుకుని కూర్చున్నారు. అటు వైపుగా వెళ్తున్న నరేంద్ర, సాయి అనే వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని మంచానికి తగిలించడంతో గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

దానిమ్మ మొక్కల ధ్వంసం

బత్తలపల్లి: సంజీవపురంలో బీజేపీ నాయకుడు సురేంద్ర నాయుడు సాగు చేసిన 43 దానిమ్మ మొక్కలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయాన్ని ఆదివారం సాయంత్రం గుర్తించినట్లు బాధితుడు తెలిపాడు. చెట్లను నరకకుండా కేవలం తొక్కి, విరిచేసినట్లుగా ఉన్నాయన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపిక



ఉష నవ్య శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్/ధర్మవరం రూరల్: రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. ఈనెల 20వ తేదీన గుంతకల్లు రైల్వే క్రీడా మైదానంలో 12వ రాష్ట్రస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ధర్మవరం ఆర్డీటీ క్రీడా మైదానంలో కబడ్డీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఉష, నవ్య, శ్రీనివాసులు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మే నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు అభినందించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ అజింబాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన లేఖన, ఓంశ్రీ, పర్హాన ఇటీవల కదిరిలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

కారు బోల్తా: ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన శ్రీనివాస్ నాయక్, దీపక్ రాథోడ్

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని జ్వాలాపురం క్రాస్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నుంచి కదిరి వైపునకు వెళ్తున్న కారు జ్వాలాపురం వద్ద తాటికాయలు బొప్పెలపై (తాటి ముంజలు తీసేసిన తరువాత) వెళ్లడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో వెళ్తున్న కదిరి ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ నాయక్, ఆయన కుమారుడు దీపక్ రాథోడ్ గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సంఘటనా స్థలాన్ని బత్తలపల్లి ఏఎస్ఐ సోమశేఖర్ మూర్తి సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై తాటికాయల బొప్పెలు పడేసిన వారిని సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

కదిరి టౌన్: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. సోమవారం కదిరి అలంఖాన్ మసీదులో మైనార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 25వ తేదీన కదిరిలో శాంతి ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. నమాజ్ తరువాత 1 గంటకు జీమాను సర్కిల్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ మెంబర్స్ మౌలానా, సమీవుల్లా, షామీర్ తదితరులు పాల్గొన్నారు.